# నేను నేనే-12

**Index** **Page no**


| | |
|---|---|
| 173. కలకాని కల్లగాని కల | 2 |
| 174. జన్మ - కర్మ ఈ రెంటిలో ఏది ముందు? | 3 |
| 175. ప్రారబ్ధం | 6 |
| 176. మరణించి జీవించాలి | 8 |
| 177. నేను____________ | 14 |
| 178. ధర్మం సత్యం అనుష్ఠాన వేదాంతం | 16 |
| 179. నిత్యసత్సంగం | 20 |
| 180. ఉండేది నేనొక్కణ్ణే - కామా -ఫుల్ స్టాప్ | 22 |
| 181. పరిష్కారం నీ చేతిలో లేదని తెలుసుకోవడమే పరిష్కారం | 26 |
| 182. దేవుడు అంటే మొత్తము-తారుమారు | 29 |
| 183. ఘటన-నటన-అంతా సమానం-అందరూ సమానం | 35 |
| 184. వెలుపల ధర్మం - లోపల సత్యం | 37 |
| 185. ఆత్మ అనేది కూడా ఓ ఆలోచనే | 42 |
| 186. Mono Actor పరమేశ్వరుడు | 43 |
| 187. ఉండు | 44 |
| 188. దేనికీ ఆశ్చర్యపోవద్దు | 46 |
| 189. ఈ మెలకువ అనే కల నుండి మేలుకుంటే పరమాత్ముడు శేషిస్తాడు | 48 |
| 190. 1 (ఒకటి) | 49 |

## 173. కలకాని కల్లగాని కల

కలకాని, కల్లగాని కల...అనే టైటిల్ కు అర్థమేమంటే-

ఊహ, వాస్తవం రెండూ ఒకటే జ్ఞానిదృష్టిలో.

మనం ఓ కల కంటాం...మేల్కొన్నాక ఆ కలను ఇంకొకరితో చెప్పుకుని నవ్వుకుంటాం...
అంటే ఈ జాగ్రదవస్థ వాస్తవమైనట్టు.

నిజానికి జాగ్రదవస్థ కూడా ఓ కలే.
ఆ కలకు కొనసాగింపే ఈ కల.

కల-మెలకువ రెంటినీ వేరు వేరు అని
అనుభవించడం అనేది అజ్ఞాని లక్షణం.

కల-మెలకువ రెంటినీ కలగా అనుభవించడం
జ్ఞాన లక్షణం.

మన కల, మరొక కలకు కారణమవుతుంది.
అదే జన్మపరంపర అంటే.
మనది 'అజ్ఞానం' అనే గాఢనిద్ర.

జ్ఞాని కల మెలకువతో(ఎరుకతో) కనే కల.
కాబట్టి జ్ఞాని, కలకు బంధితుడు కాడు.
వారిది 'ప్రజ్ఞ' అనే మెలకువ.

'ఇది కల' అనేది మనం మరచిపోతుంటాం కాబట్టి
బంధాలు తగులుకుంటున్నాయి.

జ్ఞాని మాటలు  అనేవి

జ్ఞాని కలలో నుంచి పుట్టినవి.

ఈ 'సంభాషణ' కూడా కలేకాని,
అట్లని కలా కాదు, కల్లా కాదు...

మనల్ని 'నిజమైన మెలకువ'లోకి తీసుకెళ్లే
కల ఇది.

**174. జన్మ - కర్మ ఈ రెంటిలో ఏది ముందు?**

"జ్ఞానమెట్లా కలుగుతుంది?" అని ఒకావిడ గురువుగారిని ప్రశ్నించారు...

జ్ఞానం కలుగుతుంది...
కానీ ఎట్లా కలుగుతుందనే విషయాన్ని
ఇంతవరకు ఎవరూ కనిపెట్టలేదు...
అన్నారు గురువుగారు నవ్వుతూ...

అప్పుడు ఆవిడ ఏ భావుకతకు లోనైనారో...?
వారి కళ్ల వెంబటి నీరుకారటం చూశాం...

మనసులో బాధ ఉన్నప్పుడు కారే కన్నీరు వేడిగా ఉంటుంది...ఇది దుఃఖధార.

అసలు మనసే తొలగినప్పుడు కారే కన్నీరు చల్లగా ఉంటుంది....ఇది ఆత్మధార.

భగవన్నామం వినగానే ఎవని కంట కన్నీరు కారుతుందో....వారికి అదే చివరి జన్మ... అన్నారు రామకృష్ణులు.

"ఖం" అంటే ఆకాశం...

ఇతరుల కోసం, ఇతరం కోసం ఏడ్వడం
దుః"ఖం"(చెడ్డ ఆకాశం).

దేవుని కోసం మాత్రమే ఏడ్వడం
సు"ఖం"(మంచి ఆకాశం).

మంచి ఆకాశం అంటే "చిదాకాశం".

* * *

జన్మలు-కర్మలు గురించి...అడిగారొకరు...

నేనన్నాను-

జన్మ - కర్మ ఈ రెంటిలో ఏది ముందు?

జన్మ ముందు అయితే,
కర్మ లేకుండా జన్మ ఎలా కలుగుతుంది?

కర్మ ముందు అయితే జన్మ లేకుండా కర్మ ఎలా చేయగలవు? అన్నాను.

అవును...చెట్టు ముందా? విత్తు ముందా?  లాంటి ప్రశ్నే ఇది...అన్నాడతను.

అవును...ఇది అనవస్థాదోషమని చెప్పబడింది వాశిష్ఠంలో...

"జన్మలకు, కర్మలకు కారణం భగవదిచ్ఛ" అనే సమాధానమే చిట్టచివరి సమాధానం. అని చెప్పాను.

పురుష ప్రయత్నము-ప్రారబ్ధము-భగవదిచ్ఛ గురించి ఒకరు అడిగారు...

మన వశంలో లేని ఓ శక్తికి
మనమంతా వశమై ఉన్నాం...
ఆ శక్తి యొక్క ప్రకటనారూపాలకు ఉన్న మూడు పేర్లే -
1.పురుషకారం
2.ప్రారబ్ధం

3.భగవదిచ్ఛ

అందులో నాకిష్టమైన పేరు - భగవదిచ్ఛ.
భగవదిచ్ఛయే పురుషకారంగా, ప్రారబ్ధంగా ఉన్నది అని అంటాను.

మీరు ఆ శక్తిని "ప్రారబ్ధం" అనే పేరుతో పిలుచుకుంటామంటే నాకేమీ అభ్యంతరం లేదు...

అప్పుడు ప్రారబ్ధమే పురుషకారంగా, భగవదిచ్ఛగా ఉంటుంది...అన్నాను.

కర్త వారి వారి ప్రారబ్ధకర్మానుసారంగా జీవులను ఆడిస్తున్నాడు...అని భగవాన్ కూడా ప్రారబ్ధం అనే పదాన్ని వాడారు...అన్నారు ఒకరు...

ఆ భగవాన్ తొలి ఉపదేశానికి వివరణ ఇలా ఇచ్చాను-

కర్త(భగవంతుడు)- కుమ్మరి.

మట్టితో ఏ పాత్రను తయారుచేయాలన్నది ఆయన యొక్క ఇచ్ఛ.

ఆ భగవదిచ్ఛకు మరో పేరే ప్రారబ్ధం.

అంతేగాని ప్రారబ్ధం అనేది 'గత-జన్మ-కర్మ' విశేషం కాదు.

ఆ ప్రారబ్ధమే పాత్రల యొక్క స్వరూప, స్వభావాలను నిర్ణయిస్తుంది.

కర్త జీవులను ఆడిస్తున్నాడు అంటే,
ఆయా పాత్రల స్వరూప స్వభావాలను అనుసరించి భగవంతుడు వాటిని వాడుకోవడమన్న మాట.

జీవుడు కర్త కాదు కనుక,

జరిగే సకలము భగవదిచ్ఛ మేరకే జరుగుతోంది కనుక

జీవుని అసలు పాత్ర మౌనంగా ఉండటమే.

* * *

## 175. ప్రారబ్ధం

ప్రారబ్ధం అనే పదం-
చెడుకర్మలకూ వర్తిస్తుంది, మంచికర్మలకూ వర్తిస్తుంది.

చెరశాలలో ఉన్నవాడు "ఇది నా ప్రారబ్ధం" అంటాడు.
భగవానులు కూడా "ఇది నా ప్రారబ్ధం" అన్నారు.

పశుత్వం, ఋషిత్వం రెండూ ప్రారబ్ధాలే.
చెడ్డ ప్రారబ్ధాన్ని మాత్రమే ప్రారబ్ధం అంటున్నాం.
మంచి ప్రారబ్ధాన్ని "దైవానుగ్రహం" అంటున్నాం.
రెండూ ప్రారబ్ధాలే.

చెడుకర్మలు - రాళ్లమూట.
సత్కర్మలు - అన్నంమూట.

బాటసారికి ఒక మూట బరువును పెంచుతుంది.
మరొకమూట ఆకలిని తీర్చి బరువును పోగొడుతుంది.

ముల్లును ముల్లుతోనే తీయాలంటారు కదా!
అలానే కర్మను కర్మతోనే తొలగించాలి.
కర్మను నాశనం చేసే బీజాలు కర్మలోనే ఉన్నాయి...
అంటారు భగవాన్.

అలా కర్మను నాశనం చేసే కర్మలే సత్కర్మలు...

ప్రారబ్ధం అనేది ఒక పొట్లెలు,

పురుషప్రయత్నం అనేది ఒక పొట్టేలు.
ఈ రెంటి పోరాటంలో బలమైనది గెలుస్తుంది.

ప్రారబ్ధమనే పొట్టేలును జయించాలంటే,
పురుషప్రయత్నం అనే పొట్టేలు బలం పుంజుకోవాలి.

సాధనల ద్వారా సంచితమనే సంచిలో ఉన్న కర్మలను ఖాళీ చేయాలి.

అనేక జన్మల నుండి చేసిన పురుషప్రయత్నమే
సంచితంగా ఏర్పడుతుంది.

"సంచితం" అనే సంచిలో నుంచి కొద్దిగా కర్మలు తీసుకొని...
దానిని ప్రారబ్ధం అనే పేరుతో అనుభవించడానికి
మళ్లీ fresh గా జగత్తుతో సహా జన్మ తీసుకుంటాడు.

ఇదే పాతప్రపంచంలో అనేక జన్మలు ఎత్తడం కాదు,
క్రొత్తజన్మతో పాటు క్రొత్తప్రపంచాన్నే సృష్టించుకుంటాడు
తన ప్రారబ్ధమనే ముడి సరుకుతో.

వేలకు వేలు ఇలా క్రొత్త క్రొత్త ప్రపంచాలను, క్రొత్త క్రొత్త జన్మలను సృష్టించుకొని కొనసాగిస్తూ ఉండడం అనేది జీవుని స్వభావం. అంతే.

* * *

జ్ఞానయోగం ఏం చెబుతోందంటే-

జీవుని స్వభావం - సృష్టి చేయడం.
జీవుని స్వరూపం - కేవల"స్థితి"లో ఉండడం.

స్వభావం వైపు ఉన్న జీవునికి పార్వతి అని పేరు.
స్వరూపం వైపు ఉన్న జీవునికి శివుడు అని పేరు.

ఈ రెండూ ఏకకాలంలో ఉంటాయి.

ఇదే అర్ధనారీశ్వరతత్త్వం.

అందువల్ల జీవునికి-
శాశ్వతమైన బంధమూ లేదు...
శాశ్వతమైన మోక్షమూ లేదు...
సృష్టి-స్థితి-లయాలు అనేవి నిరంతరంగా కొనసాగుతూనే ఉంటుంది.
ఈ లీల అనంతం.
"ఎందుకు" అన్న ప్రశ్న అనవసరం.

అది అంతే.
ఇది ఇంతే.
అనేదే చిట్టచివరి సమాధానం.

* * *

## 176. మరణించి జీవించాలి

రమణుల "నేనెవడను?" పుస్తకానికి, ఆ పేరు కంటే "మరణించి జీవించడమెలా?" అనే పేరే సరిగ్గా సరిపోయి ఉండేది అన్నారు గురువుగారు ఓసారి

అంతేగా...అంతేగా...

'అహం మరణమే స్వరూపదర్శనము' అన్నదే
'నేనెవడను?' అనే గ్రంథసారము.

మరణించి జీవించడం అనే అనుభవాన్నే నిజంగా జ్ఞానానుభవం అనాలి.

చరిత్రకు ఎక్కకుండా అలాంటి జ్ఞానానుభవం పొందినవారు మన చుట్టూనే తిరుగుతూ ఎంతోమంది ఉండి ఉంటారు....

అందుకే త్యాగరాజస్వామి ఒక్క మాటలో చెప్పేశారు....

ఎందరో మహానుభావులు...
అందరికీ వందనములు...అని.

ఏమో.... నీ పక్కలో పడుకుని ఉన్న భార్య కూడా జ్ఞానవంతురాలై ఉండి ఉండవచ్చు....
చూడాల వలె...ఎవరు చెప్పగలరు?

సంతలో కుండలు అమ్మే వ్యక్తి కూడా జ్ఞానపూర్ణుడై ఉండవచ్చు....గోరాకుంభార్ వలె...ఎవరు చెప్పగలరు?

మనకు బట్టలు కుట్టిచ్చే దర్జీ కూడా జ్ఞానపూర్ణుడై ఉండవచ్చు... నామదేవుని వలె.

సాక్షాత్తుగా పాండురంగడే వచ్చి కులవృత్తులనే భక్తిసాధనాలుగా మార్చుకున్న అలాంటి మహాభక్తులతో స్నేహితుడిలా మెలిగేవాడు...

జ్ఞానాన్ని కొలవడానికి ధర్మామీటర్లు లేవు.
'స్వానుభవమే' ధర్మా మీటరు.

నిజానికి 'పొందినవారంతా' అప్రయత్నంగా పొందినవారే...
తర్వాతివారంతా ప్రయత్నంతో పొందాలనుకునేవాళ్లే.

పొందినవారంతా అదే చెప్పారు-
'అది' అప్రయత్నంగా పొందబడుతుంది అని...
అదే నిన్ను ఆవహిస్తుంది అని...
ఊరికే ఉండు అని...

కానీ వీరు ఊరుకుంటేగా...

"దాన్ని పొందాలంటే ఏం చేయాలి?"
అన్న ప్రశ్న యుగాలపర్యంతం వేయబడుతూనే ఉంది.

వీరి మనస్సును ఊరటపరచడానికి అన్నట్టు
ప్రతి మహనీయుడూ ఆయా కాలమాన పరిస్థితులను అనుసరించి తలా ఓ మార్గాన్ని తయారుచేసి వెళ్లిపోయారు...
అవన్నీ కలిసి మోపెడయ్యాయి...

పరమహంస చెప్పినట్టు...
నీటి కోసం గుంతలు తవ్వుతున్నారేగాని,
ఒక్క గుంతనే లోతుగా తవ్వడం లేదు...

అన్ని మార్గాలనూ పుస్తకాల్లో నింపేసుకున్నారేగాని
ఏ మార్గంలోనూ చివరివరకు నడవడం లేదు...

అన్నింటిలో ఏ మార్గం గొప్పదో వివేచించడానికే జీవితం సరిపోతోంది...

ఇక తానెప్పుడు గమ్యం చేరేది?

ఊరికే ఉండండిరా బాబూ! అని రమణులు అంటే....
ఊరికే ఉండే స్థితి కలగడానికి ఏం చేయాలి? అని మళ్లీ ప్రశ్నిస్తారు...

1.నిన్ను నీవు తెలుసుకో
2.నీ లోపలికి వెళ్లు
3.ఆత్మలో స్థిరపడు

అని మళ్లీ ఏవేవో సిద్ధాంతాలు చెప్పాల్సివచ్చింది.

సరే అదయినా చేశారా....?
లేదు
అది తప్ప మిగతా అన్నీ చేశారు...

* * *

జీవించి మరణించువాడు - అజ్ఞాని.
మరణించి జీవించువాడు - జ్ఞాని.

* * *

ఈ ఒక్క ఉపదేశాన్ని ప్రపంచానికి అందించడానికే గురువుగారు అవతరించారు ఈ భూమ్మీద...
అనేది నా ప్రగాఢనమ్మకం.

* * *

క్రీస్తు అన్నాడు...

మళ్ళీ కొత్తగా పుట్టాలి....అని.

చనిపోయి మళ్ళీ తల్లిగర్భంలోంచి పుట్టాలా?
అని అడిగారు శిష్యులు...

కాదు....మారుమనస్సు పొందటం....అంటారు క్రీస్తు.

మారుమనస్సు అంటే ఏమంటే-
కన్యగా ఉన్న అమ్మాయికి
వివాహం కాగానే భర్తకు భార్యగా,
ప్రసవం కాగానే  బిడ్డకు తల్లిగా
స్త్రీత్వానికి పూర్ణత చేకూరడం లాంటిదే.

వ్యక్తి ఏమో చూడ్డానికి ఆమెయే...
కానీ ఆ వ్యక్తిలో పూర్ణత్వం(సఫలత) సిద్ధించి ఉంటుంది.
అలాంటి పూర్ణత్వాన్ని పొందినవారే ఋషులు...

పూర్ణత్వం అనేది బాహ్యవిషయం కాదు.

* * *

"మరణించి జీవించాలి"

ఆ స్థితి కలగడం అనేది పూర్తిగా మన స్వాధీనంలో లేని విషయమే ఐనప్పటికీ, జిజ్ఞాసువులు మార్గం చెప్పమని అడుగుతూనే ఉంటారు గురువులను.

వీరి పోరు పడలేక.... కర్మ-భక్తి-జ్ఞాన మార్గాలను ఏర్పరిచారు ఋషులు.

రమణులు - "నేనెవడను" అనే ఆత్మవిచారణా మార్గాన్ని బోధించారు.

వారి వారి మనస్సు పరిపక్వతను బట్టి ఆయా మార్గాలను ఎన్నుకొని ఆ మార్గంలో ప్రయాణిస్తూ ఉంటారు జిజ్ఞాసువులు.

నిజానికి
పొందినవారు చెప్పిన మార్గంలో వెళ్లి
పొందినవారు ఎవరూ లేరు చరిత్రలో.

అందుకే -

"ఏ సాధనా అవసరం లేదు" అని చెప్పిన ఏకైక మహానుభావులు - సద్గురు సుబ్రహ్మణ్యులు.

* * *

మాటల వల్ల, చేతల వల్ల తెల్లారేదేమీ లేదు.
అని తమకు తెలిసినా సరే
కొంతమంది గురువులు ఏదో చెప్పారు...
ఏదో చేశారు...
బహుశా "చెప్పడం" అనేది వారి స్వభావం అయి ఉంటుంది.

చందనంచెట్టుకు ఏ భూమి ఆధారమో

నాక్కూడా ఆ భూమే ఆధారం అని వేపచెట్టుకు జ్ఞానోదయం కలిగింది.

అంతమాత్రం చేత తనలోని చేదు గుణం పోదు.

తెలుసుకోనంత మాత్రాన చందనంచెట్టు సుగంధం పోదు.

జ్ఞానం వలన స్వభావాలు, వ్యవహారాలు తారుమారు కావు. అన్నీ యధావిధిగానే ఉంటాయి.

జ్ఞానం అంటే అవగాహన అంతే.

అదొక మార్పు కాదు.

"అవగాహన" అనేది ఒక్క సద్గురు సన్నిధిలో మాత్రమే లభ్యం.

జపాలు, తపాలు, భజనలు, సత్సంగాలు....

ఇవన్నీ secondary....

అలాంటి గురువు దొరకాలంటే -

ఈశ్వరానుగ్రహం కలగాలి.

ఈశ్వరానుగ్రహం పొందాలంటే,

మూడు రకాలైన పెట్టుబడులు పెట్టాలి...

మొదటి పెట్టుబడి - ఆర్తి.

రెండవ పెట్టుబడి - శ్రద్ధ.

మూడవ పెట్టుబడి - శరణాగతి.

ఈ  మూటింటి వలన-

వ్యక్తిత్వాన్ని నష్టపోతాం.

దైవత్వాన్ని లాభపడతాం.

పావలా పోగొట్టుకుని రూపాయిని పొందినట్లుగా.

ఆ రూపాయిలో మనం పోగొట్టుకున్న పావలా కూడా అందులో ఉంటుంది పూర్ణంగా.

నది సముద్రంలో కలిసి తనను తాను పోగొట్టుకున్నట్టే కనబడుతుంది.
కానీ అది మహాసముద్రంగా మారుకుంటుంది.
అలాంటిదే ఈ శరణాగతి అనేది.

* * *

గురువుకు అన్ని చరిత్రలూ, అందరి చరిత్రలూ తెలుసు.
కానీ గురుచరిత్ర గురువుకు తెలియదు.

రామచరిత్ర వాల్మీకి వ్రాసినట్టు
కృష్ణచరిత్ర వ్యాసుడు వ్రాసినట్టు
సాయిచరిత్ర హేమాద్పంతు వ్రాసినట్టు
రమణచరిత్ర కృష్ణభిక్షు వ్రాసినట్టు
గురుచరిత్రను జ్ఞానశిశువు వ్రాస్తున్నాడు.

గురుచరిత్ర అంటే తత్త్వరచనే...
అంతేగానీ తేదీలతో కూడిన వారి జీవిత చరిత్ర కాదు.

ఆధ్యాత్మిక సాహిత్యాల్లో శాస్త్ర ప్రమాణం లేని రచన ఏదైనా ఉందంటే అది ఇదే అవుతుంది.
ఎందుకంటే నాకు ఏ శాస్త్రమూ తెలియదు...
గురుసన్నిధిలో కూర్చొని వారి నోటి నుండి జాలువారిన మాటలను మౌనంగా ఏరుకోవడం తప్ప.

ఇదంతా జ్ఞానశిశువు యొక్క కేరింతలే.
కేరింతల్లో గ్రామర్ ఉండదు, గ్లామర్ తప్ప.

* * *

## **177. నేను___________**

"నేను" అని వ్రాసి, దాని ప్రక్కనే ఇలా డాష్ పెట్టి అందులో వ్రాయమంటే, ఆ డాష్ లో  బాబు అని వ్రాస్తావేగాని, ఇంకెవరి పేరూ వ్రాయవు...

నేను అనేది అసలు సత్యము.
బాబు అనేది తాత్కాలిక సత్యము.

నీ శరీరం వైపు నీవు చూసుకుంటే,
నేను అని నీకు అనిపించినట్లు....

సృష్టిలో ఎవరిని చూసినా, దేనిని చూసినా
నేను అని నీకు అనిపిస్తే ఆ నేను అసలు నేను.

ఇది కేవలం మాటగా కాకుండా
అనుభవంగా ఉండాలి.

* * *

ఇంకో పద్ధతి ఏమంటే-
అసలు ఆ డాష్ లో ఏమీ వ్రాయకుండా వదిలేయడం...
కేవల నేనుగా ఉండడం...
ఆ నేను అసలు నేను.

అసలు మొదట్లో(పుట్టకముందు)తాను అలాగే ఉన్నాడు, కేవల నేనుగా...

ఆ "కేవల నేను"ఒక నామంతో, ఒక రూపంతో మమేకమై
దానిని మిక్కిలిగా అభిమానించడం వలన
బాటే తానైపోయాడు...

"నేను" సులభంగా బాబు అయిపోయింది....
"బాబు" తిరిగి నేను కావడానికి శ్రమ అయిపోతోంది...

"నేను" బాబు కావడం - సిద్ధి.
బాబు "నేను" కావడం - సాధన.

* * *

బాబు "మాత్రమే" నేను కాదు...
అందరూ, అన్నీ నేనే....బాబు "కూడా" నేనే...
అనేదే సర్వానుభవం(సర్వమూ నేనే అనే అనుభవం).

1. "సర్వమూ నేనే" అని ఉన్న నేను
2. "ఏదీ నేను కాదు" అని ఉన్న నేను
రెండూ ఒకటే.
రెండూ మంచి ఉపాసనా వాక్యాలే.

* * *

ఉపాసన అంటే- తనను తానే స్మరించడం.
సిద్ధి అంటే- తనను తానే పొందడం.

తానుగాక ఏమీలేదు.
తాను తప్ప ఎవరూ లేరు.

ఏకమేవాద్వితీయం.....

* * *

## 178. ధర్మం సత్యం అనుష్ఠాన వేదాంతం

ఆధ్యాత్మిక బోధకుల వద్ద తరచుగా ఈ క్రింది మాటలు వింటూ ఉంటాం...

ఉత్త మాటల వలన లాభం లేదు...ఆచరణ ఉండాలి...

ఉత్త గ్రంథాలు చదవడం వలన ప్రయోజనం లేదు....
ఆచరణ ముఖ్యం...

ఉత్త గురుబోధలు వినటం వలన ఒరిగేదేమీ లేదు....
ఆచరణ ప్రధానం....

కావలసింది వాచా వేదాంతం కాదు....అనుష్ఠాన వేదాంతం...అని.

ఇలా చెప్పేవారందరూ బాధ్యతను బోధిస్తున్నట్టు కనబడే బాధ్యతారహిత గురువులే....

శిష్యుడికి సరియైన అవగాహన కలిగిస్తే....ఆచరణ యొక్క అవసరం రానే రాదు.

ఆధ్యాత్మికం అనేది పూర్తిగా అవగాహన విషయమే...
ఆచరణకు సంబంధించినది కానేకాదు.

* * *

ఆచరించడానికి వీలైనది - ఆచారం(ధర్మం)
ఆచరించడానికి వీలుకానిది - ఆధ్యాత్మికం(సత్యం)

* * *

ఆచరణ బాహ్య విషయం.
అవగాహన ఆంతర విషయం.

ధర్మాన్ని కేవలం తెలుసుకుంటే చాలదు...ఆచరించాలి.

సత్యాన్ని కేవలం తెలుసుకుంటే చాలు...అనుభవించవచ్చు.

ధర్మానికి, సత్యానికి తేడా ఇదే.....

* * *

అనుష్ఠాన వేదాంతం....అనే మాటే తప్పు....
అనుష్ఠించడానికి ఏమీ ఉండదు అందులో....

ధర్మాన్ని అనుష్ఠించగలం...."ధర్మానుష్ఠానం" అనే మాట సరి.

"అనుష్ఠానవేదాంతం" అనేమాట సరికాదు.

ఆధ్యాత్మికం అనేది కేవలం అవగాహన చేసుకోవాల్సిన విషయం...అంతే.

తల్లిదండ్రుల యెడల పుత్రుడు యెలా ఉండాలో
భర్త యెడల భార్య యెలా ఉండాలో
చెప్పేది ధర్మం....ఇది ఆచరణాత్మకం.

ఉన్నదానిని ఉన్నది అని చెప్పేది ఆధ్యాత్మికం.
ఇది అప్పటికప్పటికే అనుభవంలోకి వచ్చే విషయం.

* * *

"నీవిలా ఉండు" అని చెబుతుంది ధర్మం.
"నీవెలా ఉన్నావో" చెబుతుంది ఆధ్యాత్మికం.

కాబట్టి కర్తవ్య బోధ చేసే ప్రతీది ధర్మం.

ఏ కర్తవ్యమూ లేని ఏకాత్ముడవు నీవు అని చెప్పే ప్రతీది ఆధ్యాత్మికం.

ధర్మం బాహ్యవిషయం.
సత్యం ఆంతర విషయం.

బాహ్యంలో యెంత వెతకినా సత్యం కానరాదు.
ఆంతరంలో ఆత్మనిష్ఠకు తప్ప ధర్మనిష్ఠకు చోటులేదు.

నీతి(ధర్మం) అనేది పరమం(ultimate) కాదు,
అది పరమపదాన్ని చేర్చే ఓ సాధనం మాత్రమే.

* * *

16 ఏళ్ల తిరుచ్చిళి వేంకటేశ్వరశర్మకు
ధర్మం అంటే ఏంటో తెలియదు, సత్యం అంటే ఏంటో తెలియదు.
కానీ ఆత్మ అతణ్ణి ఆవహించి మనిషిని ఋషిగా మార్చివేసింది.

అతని ప్రతి నడకా ధర్మమయ్యింది.
అతని ప్రతి పలుకూ సత్యమయ్యింది.

భూలోకంలో భగవంతునికి చిరునామాగా మారి
ఆ బాలుడు "భగవాన్" అయ్యాడు.

ధర్మాన్ని మనమై ఆవహించాలి.
సత్యమే మనల్ని ఆవహిస్తుంది.

* * *

ధర్మంలో సత్యం, సత్యంలో ధర్మం ఉండదని కాదు.
అవి రెండూ ఒకే వస్తువు.

సత్యం యొక్క బాహ్యరూపం ధర్మం.
ధర్మం యొక్క ఆంతరరూపం సత్యం.

ధర్మం చలిస్తుంటుంది...చరిస్తుంటుంది....

సత్యం అచలంగా ఉంటుంది.

ధర్మం - మార్గం.
సత్యం - గమ్యం.

* * *

"నేను బాబు" అన్నదాంట్లో -

బాబు అనేది - ధర్మం.
నేను అనేది - సత్యం.

* * *

**179. నిత్యసత్సంగం**

జ్ఞానికి ఈ ప్రపంచం ఓ మట్టిబొమ్మ...అంతే.

మట్టి అనేది జ్ఞాపకం ఉండి, బొమ్మతో ఆడుకునేవాడు ఆధ్యాత్మికుడు.

మట్టి అనేది మరచి, బొమ్మతో ఆడుకునేవాడు లౌకికుడు.

ఇద్దరిదీ ఆటే.
ఒకని ఆటలో సంఘర్షణ ఉంటుంది.
ఇంకొకని ఆటలో సంఘర్షణ ఉండదు.

* * *

దశరథుని సభలో రామ-వశిష్ఠ సంవాదం జరుగతోందని తెలిసి
ఆకాశమార్గం గుండా అనేకమంది దేవతలు, సిద్ధులు హాజరైనారని వాశిష్ఠంలో ఉంది. కారణమిదే.

స్వతహాగా వారందరూ పరిపూర్ణజ్ఞానులే ఐనప్పటికీ
ఆ సంవాదం వారి ఆత్మనిష్ఠను మరింతగా బలపరచి
స్వరూపస్థితి నుండి జారనీయకుండా చేస్తుంది.
ఈ జగత్తొక బొమ్మలాట అని మరపుకు రానీయకుండా చేస్తుంది.

కాబట్టి నిత్యసత్సంగం అనేది సాధకులకేగాదు, సిద్ధులకు కూడా అవసరమే అనేది తేటతెల్లము.

* * *

ఒకసారి ఆ "స్థితి"ని చేరుకున్నాక, మళ్లీ జారే అవకాశం ఉందా? అని అడిగారొకరు భగవాన్ను.

"ఉంది" అని సమాధానమిచ్చారు భగవాను.

కాబట్టి ఆ స్థితికి చేరడానికి ప్రయత్నించే సాధకులకు... ఆ స్థితి నుండి జారకుండా ఉండటానికిగాను సిద్ధులకు...
ఇరువురికి కూడా నిత్యసత్సంగం అవసరం.

శుద్ధపరబ్రహ్మం తప్పితే మరో పదార్థం ప్రపంచంలో లేదు.
కనుక, చెట్లుగా, పుట్టలుగా, కనిపించే నానా రకాల ప్రాపంచిక పదార్థాలు కూడా పరమాత్మ యొక్క
రూపాంతరాలే అన్న భావన నిరంతరం కొనసాగడమే నిత్యసత్సంగం.

తచ్చింతనం తచ్ఛ్రవణ
మన్యోన్యం తత్ప్రబోధనం |
ఏతదేక పర్వతం చ
బ్రహ్మభ్యాసం విదుర్బుధాః ||

దానినే ఆలోచించడం, దాన్ని గురించే వినడం, ఒకరినొకరు అదే చెప్పుకోవడం, ఎప్పుడు చూసినా అదే ఆసక్తి...
ఈ బ్రహ్మభ్యాసమే నిత్యసత్సంగం.

(నామరూపములు కలిగిన) తాను
(నామరూపములు లేని) తనతో గడపడమే నిత్యసత్సంగం.

అనగా నామరూపాలను కాక,
"కేవల ఉనికి"ని చూడడమే నిత్యసత్సంగం.

కర్త ఈశ్వరుడని
కర్మ జడమని
క్రియ క్రీడయని
ఎఱిగిన కర్మయోగి యొక్క దినచర్య నిత్యసత్సంగం.

సమాధానం దొరికే వరకు రాముడువశిష్టునితో సలిపిన సంభాషణం నిత్యసత్సంగం.

భక్తుడు భగవంతుని యెడల యెడతెగని భావపరంపరయే నిత్యసత్సంగం.

ద్రష్టనే తప్ప దృశ్యాన్ని చూడని సద్గురు అర్ధనిమీలిత నేత్రాలను స్మరించడం నిత్యసత్సంగం.

నీవు సత్సంగంలో ఉండడం కాదు,
నీవు ఎక్కడ ఉంటే, ఆ చోట సత్సంగం కావాలి....
అన్నారు గురుదేవులు.

* * *

## 180. ఉండేది నేనొక్కణ్ణే - కామా -ఫుల్ స్టాప్

రాత్రి నాకొచ్చిన కల గుఱించి గురువు గారికి చెప్పాను...

నా కలలో మీరు-
బయట అధర్మం ఎక్కువగా ఉంది...
బయట యెక్కువగా తిరక్కండి...
అని చెప్పారు....అన్నాను.

అవునా.....అన్నారు....

బయట యెక్కువుగా తిరక్కండి...అనే మాటను "వ్యవహారం ఎక్కువగా పెట్టుకోకండి" అన్న అర్థాన్నే తీసుకున్నాను ఆ స్వప్నంలో కూడా.

వ్యవహారం యెంత తక్కువగా ఉంటే అధర్మం అనే వైరస్సు మనకు అంటుకునే ఛాన్స్ అంత తక్కువగా ఉంటుంది.

తరువాత పద్మావతమ్మ గారి మరణవార్త చెప్పాను గురువుగారికి...

గురువుగారు రవ్వంత కూడా ప్రతిస్పందించలేదు...

ఒక్క క్షణం...ఆ మహాత్ముడు "కఠినాత్ముడు"గా కనబడ్డాడు...

కాసేపాగి నా వైపు తిరిగి,
ఉండేది నేనొక్కణ్ణే అయినప్పుడు
పుట్టేది ఎవరు? గిట్టేది ఎవరు? అన్నారు నిమ్మళంగా....

ఆ మాటంటున్నప్పుడు...వారి ముఖం దివ్య తేజస్సుతో వెలిగిపోతోంది....

ఆ సమయం...ఆ వాతావరణం...
చాలా గంభీరంగానూ, ప్రశాంతంగానూ ఉండి
"వారు"  "మేము" అనే బేధాన్ని తొలిగించేశాయి...
వారి ఏకాత్మనిష్ఠ అటువంటిది.
బహువచనం పోయి...ఏకవచనం మిగిలింది...

వారి సన్నిధిలో యెంతమంది ఉన్నా....
ఒకరే ఉన్నట్టు అనుభూతిని కలిగిస్తుంది.

చావు అనేది  బ్రతికుండేవాడికేగానీ, మరణించినవాడికి కాదు...అన్నారు...

పుట్టుక గురించి
పుట్టక ముందు ఉన్నవాడు చెప్పాలి...

చావు గురించి

చచ్చిన తర్వాత ఉన్నవాడు చెప్పాలి...

వాడి అడ్రసు మనకు తెలియకపోయా...

ఆ మందల(వివరం) మనకు తెలియకపోయా...

మధ్యలో ఉన్న మనం ఆ రెంటిని గురించి...అనగా మన అనుభవంలో లేని చావు-పుట్టుకలను గురించి మాట్లాడుకుంటాము....అదే చిత్రం...! అన్నారు.

అనుభవములో లేవు...అంటే,

అవి ఉండి, మనకు తెలియకపోవడం కాదు,

అవి లేక, తెలియకపోవడమే...అన్నారు.

ఈ ఆధ్యాత్మికంలో అనుభవమే పరమప్రమాణం.

అనుభవంలో ఉంటేనే ఉన్నది.

అనుభవంలో లేదంటే లేనిదే.

పుట్టుక-చావు రెండూ మన అనుభవంలో లేవు కాబట్టి అవి అసలు లేనే లేవు అని తేల్చారు.

* * *

ప్రతి సంఘటనకూ కామా పెట్టుకుంటూపోతే అది జీవనయానం.

ఏ క్షణానికాక్షణం ఫుల్ స్టాప్ పెట్టేస్తుంటే అది ఆధ్యాత్మిక యానం.

కామాపెట్టడం వల్లనే ప్రతీది కార్య-కారణ సంబంధంతో ముడిపడిపోతోంది.

వాస్తవానికి సంఘటనలన్నీ విడి విడి భాగాలే.

వాటినన్నింటినీ కలిపి చూపిస్తుంది ఈ కామాలు.

ఈ కామాలే మాయాచిహ్నాలు.

ప్రతి క్షణానికి ఫుల్ స్టాప్ పెట్టేస్తే అదే సదావర్తమానం,అదే పరమార్థం.

కొనసాగింపులేని మనసును కలిగి ఉండడమే మోక్షం.

కామా - మెలకువ.

ఫుల్ స్టాప్ - నిద్ర.

సదా ఫుల్ స్టాప్ లో ఉంటే

అదే నిజమైన మెలకువ.

కామాలు పెడితే

అదే స్వప్నము, అదే జీవితము.

సద్గురుదేవులవారు సదా ఫుల్ స్టాప్ లో సంస్థితమై ఉంటారు కాబట్టే....

దేనికీ ప్రతిస్పందించరు...

వారొక అచలం(పర్వతం)

వారి సన్నిధిలో ఉండే శాంతి,

పర్వత శిఖరాన ఉండే శాంతి లాంటిదే.

పర్వతమార్గమంతా కామాలే.

పర్వత శిఖరం ఫుల్ స్టాప్.

అక్కడ ఉన్నదంతా ప్రశాంతమే.

అన్యం తోచని ఏకత్వమే.

నామరూపాలు లేని అనంతమే.

అదే "నేను".

* * *

## 181. పరిష్కారం నీ చేతిలో లేదని తెలుసుకోవడమే పరిష్కారం.

అర్థం చేసుకోవడానికి ఏమీ లేదని అర్థం చేసుకోండి...అని యూజీ చెప్పారు.

అర్థం కాలేదు అనడం, అర్థమైంది అనడం రెండూ
వ్యక్తిజ్ఞానమే(intellectual knowledge)

భగవాన్ అంటారు-
"బుద్ధి ఆత్మాకాదు; ఆత్మకు భిన్నమూ కాదు" అని.

కాబట్టి వ్యక్తిజ్ఞానం కూడా Ultimate జ్ఞానమే.
అనంతమైన సముద్రంలో నుంచి గ్లాసులోకి తీసుకున్న నీరు కూడా సముద్రమే. కానీ గ్లాసులో ఉన్న సముద్రంలో తిమింగలాలు ఉండవు, ఆటుపోటులు ఉండవు. తుఫానులు కలగవు...

బుద్ధికి పరిమితులున్నాయి....
ఇంకా చెప్పాలంటే పరిమితిభావం వల్లనే బుద్ధి అనే పేరొచ్చింది...

* * *

"ఉన్నది" ఏదో ఉన్నది.
"లేనిది" ఎప్పటికీ లేనిదే.

ఉన్నదానిని "ఉన్నది" అని తెలుసుకోవడం తప్ప...
పొందటం అనే క్రియ అసలు లేనేలేదు...

లేనిదానిని "లేదు" అని తెలుసుకోవడం తప్ప...
పోగొట్టుకోవడం అనే క్రియ అసలు లేనేలేదు...

ఉన్న దానిని "ఉన్నది" అని...
లేనిదానిని "లేదు" అని...
తెలుసుకోవడమే జ్ఞానం...

ఆ జ్ఞానం వలన కలిగే స్థిమితమే స్థితప్రజ్ఞత...

ఆకాశాన్ని నేను పొందలేదు అనడం...
ఆకాశాన్ని నేను పొందాను అనడం...
రెండూ హాస్యాస్పదమే...

ఎవడైనా ఉన్నదానినే ఇవ్వగలడు...
లేనిదానిని ఎవడూ ఇవ్వలేడు.

శిష్యుడు ఆకాశాన్నిమ్మని అడగడం...
గురువు ఆకాశాన్ని సూట్ కేస్ లో పెట్టివ్వడం...
లాంటిదే ఇదంతానూ.

* * *

పరిపూర్ణం ఉంది.
పరిపూర్ణవ్యక్తి ఉండడు.

సముద్రానికి కెరటమేగానీ
కెరటానికి సముద్రం ఉండదు.

"తన పరిమితుల్ని తెలుసుకోవడమే వివేకం" అంటారు యూజీ.

దేని వలన బుద్ధి ప్రకాశిస్తోందో...
దానిని బుద్ధితో తెలుసుకోలేం...
అని తెలుసుకోవడం వరకే బుద్ధి యొక్క ప్రయోజనం...

* * *

ఒక్కొక్కరు ఒక్కోసారి మోక్షం పొందటం అనేది లేదు.

ఫలానా తేదీన, ఫలానా వృక్షం క్రింద ఫలానా వ్యక్తికి మోక్షం కలిగింది....అనడం హాస్యాస్పదమైన విషయం.

మోక్షం అనేది తేదీలకు, ప్రాంతాలకు(దేశకాలాలకు) సంబంధించి ఉండదు.

దేశకాలాలకు అతీతమైన దానిని దేశంలో కాలంలో వెతకడం ఎంత వరకు సబబు?

కార్యకారణాలకు సంబంధం లేనిదానిని కార్యంతో(సాధనతో) సాధించాలనుకోవడం ఎంతవరకు సబబు?

* * *

మార్గం లేకపోయినా, మార్గం కాకపోయినా రెండుమార్గాలు చెప్పి తప్పించుకున్నారు భగవాను...

1. ఊరికే ఉండు.
2. నిన్ను నీవు తెలుసుకో.

ఈ రెండూ ఎలాగూ సాధ్యం కాదని భగవానుకు స్పష్టంగా తెలుసు.

* * *

ఉండేది లోకవిచారం ఒక్కటే.
ఆత్మవిచారం అనేది లేదు.

* * *

మరి పరిష్కారమేమి?
పరిష్కారం నీ చేతిలో లేదని తెలుసుకోవడమే పరిష్కారం.

నాటకంలో తెరపైకి ఎప్పుడు రావాలో, తెర వెనక్కు ఎప్పుడు వెళ్లాలో అనేది తెర వెనుక ఉన్న దర్శకుని చేతిలో ఉందని తెలుసుకోవడమే ఇక్కడ మనం పొందగలిగే అత్యుత్తమజ్ఞానం.

* * *

182. దేవుడు అంటే మొత్తము-తారుమారు

1. వ్యక్తి

2. జగత్తు

3. జగదీశ్వరుడు

ఈ మూడూ కలిపితే "నేను" అవుతుంది...

మూడింట్లో ఒక భాగాన్నే (వ్యక్తిని మాత్రమే)నేను అనుకుంటున్నాం.

మిగతా రెండు భాగాలను(జగత్తు, జగదీశ్వరుడు) తనకు వేఱు అనుకుంటున్నాం.

తాను కోరే ఆత్మానుభవం ఏమంటే-

ఈ మూడూ మూడు కాకముందు...

అనగా ఈ మూడూ ఏకంగా ఉన్నప్పుడు...

అనగా గాఢనిద్రలో ఉన్నప్పుడు...

ఉన్న అనుభవాన్ని...

మూడుగా అయిన తరువాత...

ఆ మూడింట్లో ఒక భాగమైన తాను

ఆ మూడింట్లో ఒక భాగమైన జగత్తులో

పొందాలనే  ప్రయత్నమే జీవితం అయ్యింది.

* * *

వందరూపాయిల నోటుగా ఉన్నప్పుడు అది దైవం.

దానిని చిల్లరగా మార్చేసుకున్నాం - అప్పుడది ప్రపంచం.

అది నోటుగా ఉన్నప్పుడుగాని...

లేదా చిల్లరగా మారినప్పుడుగాని...

"వంద విలువ" మారలేదు.

అనే విషయం గుర్తెఱగడమే జ్ఞానం.

పూర్ణం సదా పూర్ణంగానే ఉంది.

దానికి ఏమైనా చేర్చు, లేదా  ఏమైనా తీసివేయి...
అది పూర్ణంగానే ఉంటుంది.

ఆధ్యాత్మికం అనేది లాభనష్టములు లేని వ్యాపారం.
అని అంటుంటారు గురువుగారు.
నీవు సాధనా చేయడం వలన లాభమూ లేదు.
చేయకపోవడం వల్ల నష్టమూ లేదు.

ఊరక ఉండగలిగితే ఊరికే ఉండు.
లేకుంటే సాధన చేసుకో.
రెండూ ఒకటే.

లాభమూ లేదు; నష్టమూ లేదు....అని తెలుసుకుని
ఎలా అయినా ఉండు.
ఏమైనా చేసుకో.

ఎవరు ఏది ఏలాగున్నా, ఏమిగా ఉన్నా
వంద వందగానే ఉంటుంది.
పూర్ణం పూర్ణంగానే ఉంటుంది.

పూర్ణాన్ని పూర్ణం  చేయనక్కర్లేదు.
అది ఉన్నరీతిన అది ఉంటుంది.
ఆకాశాన్ని ఇంకా విస్తరింపజేయగలమా?
నీటిని ఇంకా పలుచన చేయగలమా?

నీవు పొందేదీ కాదు.
అది పొందబడేదీ కాదు.

పొందేదానికి ఉనికి లేదు.
పొందబడేదానికి అన్యం లేదు.

* * *

ఇక గురువు విషయానికొస్తే-

అతడు విభజన లేని చైతన్యంగా ఉంటాడు.

"నేను ముక్తుణ్ణి" అనే భావన కూడా అతనికి ఉండదు.

అందవల్ల ఇతరులను బంధవిముక్తి చేయాలనే ప్రయత్నమే

అతనికి ఉండదు.

అతడు అచలరూపుడు...

మనం కదిలిస్తే కదులుతాడు...

అతడు మౌనస్వరూపుడు...

మనం పలకరిస్తే పలుకుతాడు...

తప్పితే అతనికి ఏ కర్తవ్యమూ లేదు.

మన ప్రశ్నలకు అతడు సమాధానం ఇవ్వాలనే

విధి కూడా ఏమీలేదు.

ప్రశ్నించేవాడికి ఉనికి లేదు.

సమాధానమిచ్చేవాడికి అన్యం లేదు.

అందుకే పృచ్ఛకుని ప్రశ్న గురువు వద్దకు చేరనే చేరదు.

గురువు సమాధానం పృచ్ఛకుని వద్దకు చేరనే చేరదు.

అందువల్లనే యుగాలపర్యంతం ఈ సమస్య సమస్యగానే ఉండటానికి కారణం.

* * *

ప్రశ్నలు అనేకం.

సమాధానం ఒక్కటే.

అనంతమైనవస్తువును ఎలా పొందటం? ఎలా పోగొట్టుకోవడం? అనేదే ఏకైక సమాధానం.

* * *

కలడంభోధిఁ, గలండు గాలిఁ, గలడాకాశంబునం, గుంభినిం
గల డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలం
గల డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం
గలఁ డీశుండు గలండు, తండ్రీ! వెదకంగా నేల నీ యా యెడన్

భగవంతుడైన విష్ణువు లేని చోటు ఈ విశ్వంలో లేదు.
సముద్రంలో ఉన్నాడు...
ఆకాశంలో ఉన్నాడు...
పుడమిపైనున్నాడు...
అగ్నిలో ఉన్నాడు...
అన్ని దిశలలోనూ ఉన్నాడు...
పగటిలో ఉన్నాడు...
సూర్యునిలో ఉన్నాడు...
చంద్రునిలో ఉన్నాడు...
ఓంకారంలో ఉన్నాడు...
త్రిమూర్తులలో ఉన్నాడు...
స్త్రీ, పురుష, నపుంసక వ్యక్తులలో ఉన్నాడు...
ఇక్కడా, అక్కడా, వెతకడం దేనికి?
సర్వేశ్వరుడు అంతటా నిండివున్నాడు.

* * *

ఇందు గల డందు లేడని, సందేహము వలదు,
చక్రి సర్వోపగతుం డెం దెందు వెదకి చూచిన,
నందందే కలడు....

* * *

జగత్తులో భగవంతుణ్ణి వెతకడం మాని,
జగత్తును భగవద్రూపంగా దర్శించడమే
భగవత్సాక్షాత్కారము.

* * *

వంద రూపాయి నాణేల మొత్తము "వంద".
అందులో ఏ ఒక్క రూపాయినాణెం మాత్రమే వంద కాదు; కాలేదు.

* * *

దేవుడు అంటే మొత్తము.
God is the whole.
అని తెలిసి స్థిమితంగా ఉండిపోతే...
అదే స్థితప్రజ్ఞత.

మెలకువలో వైవిధ్యత తప్పదు.
నిద్రలో  ఏకత్వం తప్పదు.

వందరూపాయిలు నోటుగా ఉన్నా
వందరూపాయలు చిల్లరగా ఉన్నా
వంద విలువ మారలేదు.
అని తెలిపేదే ఆధ్యాత్మికం.

ఉన్నది "ఒక్కటే" అంటే-
అది నిరాకారోపాసన అవుతుంది.

ఉన్నది "ఒక్కడే" అంటే...
అది సాకారోపాసన అవుతుంది.

కలకనేవాడికి...కలలో ఉన్న తన గుఱించి తెలుసును.

కానీ...

కలలోని తనకు...కలను కనే తనను గుఱించి తెలియదు.

కలలోని తాను జీవుడు.

కలను కనే తాను దేవుడు.

ఎవ్వనిచే...పద్యం యొక్క అర్థం ఏమంటే-

తనకు తానే శరణుచెందటం.

ఎవ్వనిచే జనించు జగము - నాచేత నాలోనే పుడుతోంది.

ఎవ్వని లోపల నుండు - నా లోపలనే ఉంటోంది.

లీనమై యెవ్వనియందుడిందు - నాలోనే కలిసిపోతోంది.

పరమేశ్వరుడెవ్వడు - నేను.

మూలకారణంబెవ్వడు - నేను.

అనాది మధ్య లయుడెవ్వడు - నేను.

సర్వము తానైన వాడెవ్వడు - నేను.

వాని నాత్మభవు నీశ్వరుని - నన్ను

శరణంబు వేడెదన్ - నేను శరణువేడుతున్నాను.

* * *

'నేను' అని వ్రాసి ప్రక్కన డేష్ పెట్టు.

ఆ డేష్ లో  నీవేమి వ్రాసినా సరిపోతుంది.

నేను అనేది - స్వరూపం - శివుడు.

డేష్ లో ఉండేది - స్వభావం - పార్వతి.

* * *

ఏది మెలకువో...దానిని నిద్ర అంటున్నాం...

ఏది కలో...దానిని మెలకువ అంటున్నాం...
ఏది జ్ఞప్తియో...దానిని మఱపు అంటున్నాం...
ఏది మఱపో...దానిని జ్ఞప్తి అంటున్నాం...
ఏది చైతన్యమో...దానిని జడం అంటున్నాం...
ఏది జడమో...దానిని చైతన్యం అంటున్నాం...

తారుమారుగా ఉన్నదే జీవితం.
మళ్లీ తారుమారు చేయడమే ఆధ్యాత్మికం.

* * *

**183. ఘటన-నటన-అంతా సమానం-అందరూ సమానం**

అంతా సమానం, అందరూ సమానం అనేది
తాత్విక విషయమే తప్పితే
practical గా అది వీలు కాదు,

అంతా సమానం అయిపోతే, దానినే మనం ప్ర(లయం) అనేది.

జగన్నాటకం కొనసాగదు.

* * *

ఓ అమాయకుడు, తాతలనాటి బంగారు గణపతి విగ్రహాన్ని అమ్మటానికి సేఠ్ వద్దకు వెళ్లాడు.

గణపతి, మూషికం, గొడుగు తూకం వేసి ధర చెప్పాడు.

వీడు శేఠ్ తో గొడవపడ్డాడు- గణపతికీ అదే ధర, ఎలుకకూ అదే ధర వేశావు అని.

శేఠ్ నవ్వి - నాకు గణపతి అయితేనేం? ఎలుక అయితేనేం? నాకు కావలసింది బంగారం...అంతే అన్నాడు.

* * *

కుమ్మరి వీధిలో పాత్రలన్నీ మట్టివే.
కానీ ఒక్కొక్క పాత్రను ఒక్కొక్క రకంగా ఉపయోగించుకుంటాం.

వెలిగా వైవిధ్యత అవసరం.
లోపల ఉండవలసింది అద్వైతానుభవం.

లోపలున్న అనుభవం బయట ప్రాక్టికల్ గా ఉండకూడదు.

బయటున్న భేదాలు నీ లోపల ఉండకూడదు.

అలా ఉంటే, జగన్నాటకం రసాభసా అయిపోతుంది.

అన్ని తేడాలూ
అన్ని భేధాలూ
అన్ని వైరుధ్యాలు
అన్ని వైవిధ్యాలు
ఉండవలసిందే.

వెలుపల నవరసభరితంగా ఉండాలి.
లోపల "ఏకరసం"గా ఉండాలి.
ఇదే ఆధ్యాత్మికత అంటే.

అత్యాశ్రమం అనదగిన రమణాశ్రమంలోనే భోజన సమయంలో బ్రాహ్మణపంక్తి, బ్రాహ్మణేతరపంక్తి అని ఉండేవి.

మరి వారిని తప్పు పట్టగలమా?

అంతెందుకు నీ కుడిచేతితో సమానంగా నీ యెడమచేతిని చూడలేవు...

నా ఇల్లే కదా  అన్నింటినీ సమానంగా చూడాలని, బాత్రూంలో చేయాల్సిన పనిని దేవునిగదిలో చేయవు కదా!

ప్రకృతిలో సహజంగా ఉన్న భేదాలకు(ధర్మానికి) తలవంచాలి.

సంఘంలో మనమై పెట్టుకున్న భేదాలను(చట్టాన్ని) గౌరవించాలి.

అంతా సమానం, అందరూ సమానం అనడం తప్పు.

ఎప్పటికీ వీలుకాదు.

ఒక్క ప్ర'లయం'లోనే అంతా సమానం అయ్యేది.

చదరంగంపైన ఉన్నప్పుడే రాజు, బంటు అనే తేడాలు...

ఆట పూర్తవగానే అన్నీ ఒకే పెట్టెలోకి చేరుతాయి.

జగన్నాటకంలో భాగస్వామ్యులైవున్నాం కనుక

వైవిధ్యత తప్పదు.

నాటకం ముగియగానే సృష్టి అంతా ఒకే ముద్దగా అయిపోవడమూ తప్పదు.

నిద్రలోనూ, చావులోనూ, ముక్తిలోనూ

సృష్టి "ఏకం" ఎలాగూ అవుతుంది...

ఆ లోపు సృష్టిని రసపుష్టిగా అనుభవించండి...

నవ్వొస్తే నవ్వండీ....

ఏడుపొస్తే ఏడవండీ...

అదొక ఘటన...ఇదొక ఘటన...

అంతా కలిపి నటన....

* * *

నరుడి బ్రతుకు నటన...

ఈశ్వరుడి తలపు ఘటన...

ఆ రెంటి నట్టనడుమ

నీకెందుకింత తపన.....

అని వేటూరి నాల్గు లైన్లలో తత్త్వసారాన్ని అందించారు.

* * *

**184. వెలుపల ధర్మం - లోపల సత్యం**

ప్రపంచచిత్రాన్ని దేవుడు గీశారు అనొచ్చుకదా?
గీశాడు అని ఎందుకు భగవంతుణ్ణి మనం డు, డు అని వాడుతాము? అనేది ఒకావిడ సందేహం.

బహువచనంగా ఉన్నట్టు కనిపించే
సదా ఏకవచనం దేవుడు.
'డు'  వాడడం దోషం కాదు.

* * *

కృష్ణుడు  అంటాం
ఆ పదమే దగ్గర.
కృష్ణులుగారు అంటే దూరం.

గారు అంటే దూరం.
ఒరే అంటే దగ్గర.

ఓరి మాయలోడా....అని రాధ దగ్గర అనిపించుకోవడమే కృష్ణుడికి ఇష్టం...

సత్యభామ చేత తన్నించుకోవడమంతగా
శృంగారాన్ని పండించాడు...
ఆ తర్వాత సత్యభామ సారీ చెప్పడం...
సత్యను తన గుండెలకు హత్తుకోవడం...
ఆ ఆనందం రసజ్ఞులకు తప్ప ఎవ్వడికీ అర్థం కాదు.

ఓసారి  గోకులంలో తన చిన్ననాటి స్నేహితుల్ని చూడ్డానికి రాజలాంఛనాలతో వెళ్లాడట కృష్ణుడు.

ఒక్క స్నేహితుడూ దగ్గరకు రాలేదట...

సత్యభామ మూతి తిప్పింది....

పెద్ద గొప్పలు చెప్పావే....నీ స్నేహితుల గురించి....ఒక్కడు రాడేం...!! అని.

ఉండు సత్యా....! అంటూ....

అన్ని ఆభరణాలను, వైభవాలను వదిలి....
కాస్త ఆవుపేడ తన ఒంటికి పూసుకుని నిలబడగానే....

వోలోమని స్నేహితులంతా వచ్చి చుట్టిముట్టారు....మా కన్నయ్య వచ్చాడోచ్.....అంటూ.

* * *

జ్ఞానాంబ దేవత అంటే దూరం.
మా అమ్మ అంటే దగ్గర.

ఒరే శివా...అంటూ ప్రాణం విడిచింది గురువుగారి సతీమణి.

శివుణ్ణి అంతగా స్వంతం చేసేసుకుంది....

భగవంతుణ్ణి అంతగా స్వంతం చేసేసుకుంటేగానీ
భక్తి పండదు.

* * *

ప్రేమకు మంచి నిర్వచనం చెప్పారు గురువుగారు-

మనమూ ప్రేమిస్తాము...దేవుడూ ప్రేమిస్తాడు...
మన ప్రేమలో బంధం ఉంటుంది.
దేవుని ప్రేమలో బంధం ఉండదు...అన్నారు.

ప్రేమ - బలం.
బంధం - బలహీనత.

దేనినయినా సరే వదలగలిగి వదలకుండా ఉండగలగడమే సరైనది.

ఎవరినో ప్రేమిస్తూ...
ఎవరి ప్రేమనో పొందుతూ...
ప్రేమ లేకుండా ఉండలేనన్న దౌర్బల్యము కలిగిన ఈ మనసును...
అశాశ్వతమైన ఈ వ్యక్తిప్రేమ నుంచి తప్పించి, శాశ్వతమైన ఆ దైవప్రేమ వైపుకు మళ్లించే ప్రయత్నమే భక్తి.

బయట ప్రేమమయంగా ఉండు.
లోపల నిరామయంగా ఉండు.

ఎప్పటికైనా నా నుంచి వారు,
వారి నుంచి నేను దూరమౌతాననే జ్ఞప్తి ఉంచుకొని ప్రేమించు...వ్యవహరించు...

యుద్ధం రావచ్చు రాకపోవచ్చు...
కానీ యుద్ధానికి సిద్ధంగా ఉండే సైనికునిలా
అన్నిటికీ సిద్ధంగా ఉండు.
"అన్నిటికీ సిద్ధపడి ఉండడమే మహాసిద్ధి" అంటారు గురువుగారు.

* * *

ధర్మం అంటే ఋషులు ఏర్పాటు చేసిన చట్టం.

ధర్మంలో అయోమయం ఉండదు,
గందరగోళం ఉండదు,

సంఘర్షణ ఉండదు.

సవరణలకు చోటు ఉండదు.

అంత పగడ్బంధీగా ఉంటుంది ధర్మం అనేది...

కానీ మనుషులు తయారుచేసిన చట్టాలు సవరణలకు గురి అవుతుంటాయి...

రామాయణం అనేది కథకాదు, చరిత్రకాదు,

రామాయణం అంటే ధర్మం, విశ్వజనీనమైన చట్టం, సహృదయంతో కూడిన జీవన విధానం.

* * *

ఈ బాబు సనాతనధర్మాన్నీ సమర్థిస్తున్నాడు,

సంప్రదాయవ్యతిరేకి అయిన యూజీనీ సమర్థిస్తున్నాడు...

దేనిని తీసుకోవాలి? అని మీకు సందేహం రావొచ్చు...

ఏకకాలంలో రెంటినీ కలిగి ఉండాలంటాను నేను.

1. ప్రపంచంలో నేను ఉండడం(బాబుగా)
2. ప్రపంచం నాలో ఉండడం(ఆత్మగా)

ప్రపంచంలో నేను ఉన్నప్పుడు

రామాయణాన్ని అనుసరించాలి.

"నాలో ప్రపంచం ఉంది" అనే ఉన్న(త)స్థితిలో

UG తత్త్వమే ఉంటుంది.

ఒకటి చేయవలసింది.

మరొకటి ఉండవలసింది.

ఒకటి వెలుపలి విషయం.

మరొకటి లోపలి విషయం.

***

**185. ఆత్మ అనేది కూడా ఓ ఆలోచనే.**

ఆత్మ తెలియబడనంతవఱకు ఆత్మ అనేది కూడా ఓ ఆలోచనే.

ఆలోచన యొక్క పుట్టుస్థానం చేరుకోమని భగవాన్ చెప్పినదానికి అర్థమేమంటే-

ఆలోచన అనేది వ్యక్తి యొక్క మెదడు నుంచి కలగడం లేదు అని.

యెందుకంటే అసలు వ్యక్తే ఓ ఆలోచన...

* * *

తలంపు మూలానికెళితే "మూలమే" ఉంటుంది;
తలంపు ఉండదు.

సముద్రపులోతును కనుగొనాలనే ప్రయత్నం చేసిన
ఐస్ బొమ్మ వలె.

మూలానికెళ్లాక తలంపు ఆ మూలానిదే అని తెలుస్తుంది.
ప్రతి అలకు మూలం సముద్రమే అయినట్టు.

* * *

రమణలు ఉన్నది నలుబది పుస్తకంలో స్పష్టంగా చెప్పి ఉన్నారు-
నేనెవడను? అని మనసు లోపల వెదకుచు హృదయమున జేరినప్పుడు నేననువాడు తలక్రిందుల పడిపోయి,
తోడనే నేనునేనచు నేనొకటి తోచును...
ఆ నేనే అహంస్వరూపము.

* * *

అన్ని ప్రశ్నలకూ మూలం - నేను.

కాబట్టి ప్రశ్నలన్నింటినీ వదిలేసి,

నేను ఎవడను? అనే ఒక్క ప్రశ్నను పట్టుకుంటే చాలు.

ఆ ప్రశ్నే ఆత్మను పట్టిస్తుంది.

ప్రశ్నలను వదలడమే ఆలోచనలను వదలడం.

ప్రశ్నే ఆటంకం సమాధానానికి.

తానే ఆటంకం సాక్షాత్కారానికి.

తాను కరిగిపోవాలి భక్తిలో... జ్ఞానంలో...

తాను మునిగిపోవాలి మేనులో... నేనులో...

* * *

## 186. Mono Actor పరమేశ్వరుడు

సో కామయత బహుస్యాం ప్రజాయేయేతి....

అంటోంది తైత్తిరీయం.

ఏకంగా ఉన్న పరమాత్ముడు

అనేకం అవ్వాలని సంకల్పించాడట.

నీలిమేఘాలను చూడగానే మనసు పులకించి నెమలి పురివిప్పి నాట్యం చేసినట్టు

అచలరూపుడైన పరమేశ్వరుడు అనేకం అవ్వాలనే సంకల్పంతోటే, చలనరూపుడై చేసిన తాండవమే ఈ ప్రపంచం.

సముద్రమే అనేక కెరటాలుగా లేచి పడుతున్నట్లు

పరమేశ్వరుడే అనేక జన్మలు ఎత్తి లయిస్తున్నాడు.

అన్ని పాత్రలూ తానే అయి నటిస్తున్న Mono Actor పరమేశ్వరుడు.

అన్ని జీవులూ, అన్ని జన్మలూ పరమేశ్వరుడే.

* * *

**187. ఉండు**

అనవసర వ్యవహారాలను ఇంట్లోకి తేవద్దు.
అనవసర ఆహారాలను వంట్లోకి త్రోయొద్దు.

శరీరం ఆరోగ్యంగా ఉంటే
శరీరం ఉన్నా లేనట్టుగానే ఉంటుంది.

మనసు నిర్మలంగా ఉంటే
మనసు ఉన్నా లేనట్టుగానే ఉంటుంది.

నీ నివాసం కంటే గొప్ప ఆశ్రమం మరొకటి లేదు.
నీ దేహం కంటే గొప్ప దేవాలయం మరొకటి లేదు.
నీ మనసు కంటే గొప్ప దైవం మరొకటి లేదు.

మిక్కిలి స్వార్థంగా జీవించు.
నీ ఆనందం కోసమే ప్రతీక్షణాన్ని వినియోగించు.

లోకసేవ పెద్ద అబద్ధం అని తెలుసుకో.
కుటుంబసేవే దేశసేవ అని తెలుసుకో.

విశ్వానికి కేంద్రం నీవు.
నీవొక్కడివి ఆనందంగా ఉంటే,
ఆ ఆనందం విశ్వవ్యాప్తం అవుతుంది.

నీ మనశ్శాంతే
ప్రపంచశాంతి.

ధర్మంతో నడువు.
సత్యంతో గడుపు.

అన్ని రకాల ప్రశ్నలనూ వదులు.
ప్రశ్నించడం నీ స్వభావం కాదు.
అన్ని ప్రశ్నలకూ సమాధానం నీవు.

నీకు నీవు ఒక్క అడుగు ఎడంగా ఉండు.
లేదా
సర్వమూ నీవే అయి ఉండు.

గంగలో మునగడం కాదు,
నీలో నీవు మునుగు.

తెరను(ఆత్మను) గుర్తులో ఉంచుకొని
ప్రపంచ సినిమా చూడు.

మనసారా ఏడువు.
కడుపార నవ్వు.

చివర్లో ఇదంతా ఓ నాటకం అనుకుని
అన్నీ దులుపుకుని స్వంతగూటికి(హృదయానికి) చేరుకో.

ఈ జగత్తొక స్వప్నం.
మహర్షి నేనే, నీచుడూ నేనే అని ఉండు.

ఎవరి అభిప్రాయాలనూ నీ మెదడులో నింపకు.

ఎవరినీ నీ అభిప్రాయాలతో చంపకు.

నీ చెవులను ఎవరికీ అప్పగించకు.
నేను-ఉన్నాను అని నీలో వినబడే మాటను విను.

నీ చూపును ఏ దృశ్యాలకూ అంకితం చేయకు.
నీలోని ద్రష్టను పరికించి చూడు.

వెలుపల ఉంటే ప్రశ్న తెగదు.
లోపల ఉంటే ప్రశ్న పుట్టదు.

వెలుపల నటించు.
లోపల జీవించు.

నిత్యవ్యవహారంలో ఉన్నట్టే ఉండాలి.
మనసెప్పుడూ "నేను" పైనే కేంద్రీకరించి ఉండాలి.

అందరికీ నీవు ఉన్నట్టే ఉండు.
నీకు నీవు లేనట్టు ఉండు.

"ఉండు" అంతే.
అలా ఇలా ఉండొద్దు.

ఇవి కావు అంత్యప్రాసలు.
నీ తప్పుడు జీవితానికి అంత్యక్రియలు.

* * *

## 188. దేనికీ ఆశ్చర్యపోవద్దు

1. జగన్మిథ్య... అన్నారు శంకరులు.

2. సర్వం ఖల్విదం బ్రహ్మ... అన్నారు వేదఋషులు.

రెంటిలో ఏది సత్యం?

రెండూ సత్యమే.

మొదటిది సాధనావస్థలో చెప్పబడింది.

రెండవది సిద్ధ్యావస్థలో చెప్పబడింది.

* * *

జగన్మిథ్య అన్నా-

జగత్తులోని ఏ విషయానికీ ఆశ్చర్యపోనక్కర్లేదు...

అది మిథ్యే కాబట్టి.

సర్వం ఖల్విదం బ్రహ్మ అన్నా-

జగత్తులోని ఏ విషయానికీ ఆశ్చర్యపోనక్కర్లేదు...

అంతా బ్రహ్మమే కాబట్టి.

* * *

"దేనికీ ఆశ్చర్యపోవద్దు"

ఇది వివేకానందులకు వారి తండ్రి ప్రసాదించిన

మహోపదేశం...

అందువల్లనే-

ఆ సంపన్న దేశాలలో...

ఆ భోగ దేశాలలో

దేనికీ అంటకుండా...

ఓ ఋషిలా సంచరించగలిగారు.

* * *

1. ఆశ్చర్యపోవడం,

2. ఆసక్తిగా చూడడం...

ఇవి అజ్ఞానానికి ప్రధాన లక్షణాలు...

***

**189. ఈ మెలకువ అనే కల నుండి మేలుకుంటే పరమాత్ముడు శేషిస్తాడు**

ఇతరుల గుర్తింపును తాను కోరుతున్నాడంటే,

తనను తాను గుర్తించలేదనే దానికి అర్థం.

తనను తాను గుర్తిస్తే, తాను గుర్తించడానికి ఇతరం ఉండదు.

* * *

తనను తాను గుర్తించడం అంటే

తాను తప్ప మరేదీ లేదని గుర్తించడమే.

ఇతరమంతా తానెట్లా అవుతాడు? అని సందేహం...

తాను మేలుకుంటేనే ఇతరమంతా తోస్తోంది కాబట్టి

తానుంటేనే ఇతరానికి ఉనికి కాబట్టి.

ఇతరమంతా తానే; తనలోనిదే అని తేల్చారు వేదాంతులు.

తనలో అంటే "బాబు"లో అని కాదు;

బాబు కూడా తనలోనివాడే.

స్వప్నంలో ఇతరంగా తోస్తున్నంతా నిజానికి

కలకనేవానిలోనిదే కదా...అని దృష్టాంతం కూడా చూపారు.

కలలో నుంచి మేలుకుంటే బాబు శేషిస్తాడు.

ఈ మెలకువ అనే కల నుండి మేలుకుంటే పరమాత్ముడు శేషిస్తాడు.

కాబట్టి ఈ కనబడే సమస్తమూ "నాలో"నిదే
అని సదా భావిస్తూ ఉండడమే "నిజమైన మెలకువ"కు సాధనంగా చెప్పారు.

"నాతో సహా సర్వమూ నాలో ఉన్నట్లు ఉన్నది"
అనే ఈ సిద్ధ్యానుభవం-

ఒక్కొక్కరికి సహజంగా కలుగుతుంది...
సద్గురు సుబ్రహ్మణ్యనిలా...

ఒక్కొక్కరికి ప్రయత్నపూర్వకంగా కలుగుతుంది...
బుద్ధునిలా...

ఒక్కొక్కరికి హఠాత్తుగా సంభవిస్తుంది...
రమణునిలా...

ఒక్కొక్కరికి విశ్వాసం వలన సంభవిస్తుంది...
నిసర్గదత్తుని వలె...

ఒక్కొక్కరికి విపత్తు(calamity)లా సంభవిస్తుంది...
యూజీలా...

* * *

**190. 1 (ఒకటి)**

నేను UG గారి మాటనొకటి గురువుగారికి చూపించాను నా ఫోన్ లో...
అదేమంటే-
"సద్గురువనేవాడు నిజంగా ఉంటే
ముందు తన నుంచి ముక్తుణ్ణి చేస్తాడు."

గురువుగారు చదివి... ఇలా సవరించారు-

"సద్గురువనేవాడు నిజంగా ఉంటే
ముందు తన నుంచి తనను ముక్తుణ్ణి చేస్తాడు."

UG గారు చెప్పిన ఘాటైన మాటొకటి చెప్పా...గురువుగారేమంటారో అనే ఉత్సుకతతో...

అవును...రెండూ ఒకటే...రెండూ మత్తు కలిగించేవే...అన్నారు గురువుగారు.

* * *

నీవు వ్రాస్తున్న ఏ వాక్యానికైనా సరే,
క్రింద సైన్(పేరు) ఉండకుండా చూడు...

సద్గురు అనిగాని, బాబు అనిగాని చేర్చకు.
వాక్యం మాత్రమే ఉండాలి.

వాక్యం ఎవరిదీ కాకుండా ఉన్నప్పుడే
అది సత్యవాక్కు అవుతుంది.

"బాబు"నే అసత్యం అయినప్పుడు
బాబు చెప్పే వాక్యం ఎట్లా సత్యం అవుతుంది?

బాబు అని సైన్ చేయకుండా ఉంటే ప్రపంచంలో ఉన్న అన్ని వాక్యాలూ నీవే అవుతాయి.

సైన్ పెడితే ఇదొక్కటే నీదవుతుంది.

బాబుగా ఉండకుండా "ఉన్నాను"గా ఉండు.
అప్పుడు అన్ని ఉనికులూ నీవే అవుతావు.

* * *

మన ప్రాచీన ఋషులు ఎన్నో తాత్విక చర్చలు జరిపేవారు...
చివర్లో నేతి-నేతి(ఇదికాదు-ఇదికాదు) అంటూ ముగించేవారు...

ఇది కాదు అని చెప్పుకోవడానికి చర్చలెందుకు?
మొదట్లోనే "ఇది ఏదీ అది కాదు" అనుకుంటే పోలా...!

* * *

మేలుకొంటే కలలోకి జారినట్టు లెక్క.
నిద్రపోతే మేలుకున్నట్టు లెక్క.

* * *

గురువు జ్ఞానే అయితే
శిష్యుడు కూడా జ్ఞానే.

శిష్యుడు అజ్ఞానే అయితే
గురువు కూడా అజ్ఞానే.

ఏదైనా సరే ఒక లెక్కలోనే ఉండాలి.

"నేను" అనే శరీరానికి -
కుడిచేయి గురువు.
యెడమచేయి శిష్యుడు.

* * *

రామాయణం వ్రాసింది రామాయణంలో ఉన్న వాల్మీకి కాదు.

రాముడూ తానే,
రావణుడూ తానే,

అందులోని అన్నిపాత్రలూ
తానై వున్న "తానే" రామాయణం వ్రాసింది.

* * *

అళగమ్మ తనయుడు వేంకటరామన్ తన 16 వ యేట
నిజంగానే చనిపోయాడు(ఖాళీ అయిపోయాడు).

తరువాత ఆ ఖాళీలో ఉన్నవాడు భగవంతుడే...
అందుకే అప్పట్నుంచి "భగవాన్" అని పిలిచారు.

ఆ తరువాత ఉన్న చరిత్ర
వేంకటరామన్ కు సంబంధించినది కాదు.

వేంకటరామన్ చరిత్ర
భగవాన్ కు సంబంధించినది కాదు.

వర్తమానం అనేది కాలానికి సంబంధించినదే.
కానీ భగవాన్ చెప్పిన -
"వర్తమానంగా ఉండు" అనే స్థితి,
అది కాలానికి సంబంధించిన వర్తమానం కాదు.
ఆ వర్తమానం "నేను" కు పర్యాయపదం.

* * *

చిరంజీవి అంటే -
పుట్టి మరణించనివాడు అనికాదు.

చిరంజీవి అంటే జీవి కానివాడు...
చిరంజీవి అంటే పుట్టనివాడు...

* * *

గురువుగారు
ఓ సూక్తిని చదివి వినిపించారు-

"మౌనమే సద్గురు స్వరూపం.
సద్గురు సన్నిధిని అనుభవించాలంటే
మౌనంగా ఉండు సరిపోతుంది."

అందులో చివరి లైన్ ను ఇలా సవరించారు-
"మౌనమే నీవుగా ఉండు"

* * *

1 (ఒకటి) అనే అంకె గల చిత్రమును పటం కట్టి గోడకు తగిలించి దానిపైపు చూస్తూ ఉండండి...

అది వేదాంతం చెప్పినట్టు ఇంకెవరూ చెప్పలేరు.
దానికి మించిన దైవం లేదు, దానికి మించిన గురువూ లేదు.

ఏకంగా ఉన్న తాను కలలో అనేకం అయినట్టు
ఏకమే అనేకమయ్యింది.
కానీ ఏకం ఏకంగానే ఉంది.

మెలకువలో కూడా -
వ్యవహారంలో అనేకంగా ఉంటూ
అనుభవంలో ఏకంగా ఉండాలి.

జీవునిది బూటకం.
దేవునిది నాటకం.

* * *

తన యదార్ధస్వరూపం
జ్ఞప్తిలో ఉన్నప్పుడు జ్ఞానాంబగా ఉంటాడు.
జ్ఞప్తిలో లేనప్పుడు జ్ఞానశిశువుగా ఉంటాడు.
మునిగిపోయేదేముంది?

తాను జ్ఞానశిశువుగా ఉన్నప్పుడు
శరణమనే "భక్తి" ఉంటుంది.

తాను జ్ఞానాంబగా ఉన్నప్పుడు
అనుగ్రహించే "శక్తి" ఉంటుంది.

ఇదీ తానే.
అదీ తానే.

* * *